పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు ఈ నెల 31 గడువు

సిటీ బ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్‌తో పాటు పై చదువులు అభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ కటకం రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలని అన్ని కళాశాల ప్రిన్సిపాళ్లను ఆయన కోరారు.

ఔషధ మొక్కల పెంపకంపై నేడు శిక్షణ

వ్యవసాయ యూనివర్సిటీ, (హైదరాబాద్)మే 23: ఔషధ మొక్కల పెంపకంతో అధిక లాభాలు ఉంటాయని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన ఔషధ సుగంధ మొక్కల పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ కృష్ణ వేణి సూచించారు. రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాల ఆవరణలో శనివారం శిక్షణ ఉంటుందని, సుగంధ ఔషధ మొక్కల పెంపకంపై ఆసక్తి గల రైతులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరారు.

జీపీవో పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్, మే 23 (నమస్తే తెలంగాణ): గ్రామ పాలన అధికారి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కూకట్‌పల్లిలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న గ్రామపాలన అధికారి పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 52 మంది అర్హులైన వీఆర్వోలు ఈ పరీక్షకు హాజరవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 9:30 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించి అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 733720990 కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.



ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న ఖరీదైన చేతిగడియారాలు

ఆర్‌జీఐఏలో జ్యువెలరీ షో అదుర్స్

శంషాబాద్ రూరల్, మే 23 బంగారం ధగధగలు.. వజ్ర వైఢుర్యాల వెలుగులు.. వెండి తళతళలు.. ముత్యాల సొబగులకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని జీఎంఆర్ ఏరీనా వేదికగా మారింది. శుక్రవారం తెలంగాణ జ్యువెలరీ అసోషియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు మొత్తం 500లకు పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇక్కడి ఖరీదైన వస్తువులను సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ బంగారం ధర పెరిగినా ప్రజల నుంచి మంచి డిమాండ్ ఉందని వివరించారు. ఇలాంటి స్టాళ్ల ఏర్పాటుతో అనేక ప్రయోజనాలుంటాయన్నారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా చూడాలి

సమీక్షల్లో ఫైర్ శాఖ డీజీ నాగిరెడ్డి ఆదేశం

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వార్‌హాల్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు ఆయా శాఖలు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్, టౌన్ ప్లానింగ్, హైడ్రా, ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో పురాతన భవనాలలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు శాఖాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాగిరెడ్డి వివరణ కోరారు. ఇటీవల గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర ఆందోళనకు గురిచేసిందని, అలాంటి పురాతన భవనాల్లో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా శాఖల ద్వారా అవసరమైన సూచనలు ఇవ్వాలని కోరారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముఖ్యంగా జీహెచ్ఎంసీలో వ్యాపార సముదాయాలు, వ్యాపార భవనాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అవగాహన కల్పించి, పాటించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. హెరిటేజ్ బిల్డింగ్‌లో గాని, ఇతర బిల్డింగ్‌లో షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదాలు సంభవించకుండా ఎలాంటి పరికరాలు వాడాలో ఎలక్ట్రికల్ అధికారులు ప్రైవేటుగా ఫిట్టింగ్ చేసే వ్యక్తులకు అదే విధంగా లైన్‌మెన్‌లకు పూర్తి అవగాహన కల్పించాలని, అంతేకాకుండా ఎలక్ట్రిక్ షాప్‌లు నిర్వహించే యజమానులకు దశల వారీగా అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని డిస్కమ్ సీఈని కోరారు. టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ఫైర్ సేఫ్టీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సేఫ్టీ మెజర్స్ ఉంటేనే ట్రేడ్ లైసెన్స్ గానీ, ఎన్ఓసీ జారీ చేయాలని సూచించారు. నెలకు ఒక రోజు ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు నాగిరెడ్డి వివరించారు.

నిర్మాణ అనుమతిలోనే ఫైర్ సేఫ్టీకి ప్రాధాన్యం

శిథిలావస్థలో భవనాలను సర్వే చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. డీజీ సూచన మేరకు వ్యాపార సముదాయాలు, వ్యాపార భవనాలలో ఫైర్‌సేఫ్టీ విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు నూతన నిర్మాణానికి అనుమతి కోసం వచ్చే ప్లాన్‌లో ఫైర్ సేఫ్టీ ప్రాధాన్యత నివ్వాలని కోరారు. వ్యాపార సముదాయాలు, వ్యాపార భవనాలలో ఫైర్ సేఫ్టీ పై చర్యలు తీసుకుంటామన్నారు. – జీహెచ్ఎంసీ కమిషనర్

ఆ రెండు శాఖలకే సమాచారం వెళ్తుంది

ఫైర్ యాక్సిడెంట్ జరిగిన సందర్భంలో ఫైర్, పోలీస్ శాఖ మాత్రమే సమాచారం వెళుతున్నదని, సంబంధిత సమాచారం రెవెన్యూ శాఖకు సమాచారం ఇస్తే అంబులెన్స్, చికిత్స, బెడ్స్ , డాక్టర్లను సిద్ధం చేయడం లాంటి చర్యలు సకాలంలో తీసుకునే వెసులుబాటు ఉంటుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 15 మీటర్ల లోపు ఉన్న భవనాలు, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, ఆఫీస్ బిల్డింగ్, లాడ్జింగ్, హోటల్, బిజినెస్ మాల్స్, స్టోరేజీ బిల్డింగ్‌లు తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలన్నారు. స్మోక్ డిటెక్టర్‌తో పాటు అలారం కూడా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంకన్న, ప్రదీప్, డిస్కమ్ సీఈ, హైడ్రా, ఫైర్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు తమ సూచనలు ఇచ్చారు. – జిల్లా కలెక్టర్ అనుదీప్

హజ్‌యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, మాజీ చైర్మన్ మసియుల్లా ఖాన్, ఎంకే బద్రుద్దీన్లు

హజ్ యాత్రికులకు సౌకర్యాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దే..

అబిడ్స్, మే 23: తెలంగాణ ఏర్పాటు తర్వాత హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని మాజీ మంత్రులు మహమూద్ అలీ, వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ మసియుల్లా ఖాన్, బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఎంకే బద్రుద్దీన్‌తో కలిసి జెండాను ఊపి హజ్‌యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ యాత్రికుల కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని విధాలా చేదోడువాదోడుగా నిలిచారన్నారు. 10 సంవత్సరాల్లో హజ్ యాత్రికుల సంఖ్య పెరిగిందన్నారు. యాత్రకు వెళ్తున్న వారు క్షేమంగా తిరిగి రావాలని వారు ప్రార్థించారు. అలాగే తెలంగాణలో తిరిగి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని యాత్రికులు ప్రార్థించాలని కోరారు.

సైనిక్ స్కూల్‌ను మంజూరు చేయాలని కిషన్‌రెడ్డికి వినతి

విద్యార్థులను అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు సైనిక్ స్కూల్ మంజూరు చేయాలని, ఏపీలోని సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు స్థానికతను కల్పించాలని క్రాంతికీన్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని దిల్‌కుషా హౌస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ వినతిపత్రాన్ని కిషన్‌రెడ్డి స్వీకరించి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఏడాదిలోపు రాష్ట్రంలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 50 మంది క్రాంతికీన్ విద్యార్థులను కేంద్రమంత్రి అభినందించారని తెలిపారు.

ఒకే రోజు 108 మారుతి స్విఫ్ట్‌ల భారీ డెలివరీ

సిటీబ్యూరో, మే23, (నమస్తే తెలంగాణ): భారతదేశంలోనే అగ్రగామి కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి, ప్రముఖ డీలర్ వరుణ్ మోటార్స్ సంయుక్తంగా మే 23న హైదరాబాద్‌లో ఒకే రోజు 108 "ది ఎపిక్ న్యూ స్విఫ్ట్" కార్లను వినియోగదారులకు అందించారు. ఈ భారీ డెలివరీ వేదికగా వరుణ్ మోటార్స్ అరేనా షోరూం నిలిచింది. "ది ఎపిక్ న్యూ స్విఫ్ట్ – ఆల్ న్యూ జెడ్ సిరీస్ ఇంజిన్"తో వచ్చిన 4వ తరం స్విఫ్ట్, గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో 1.8 లక్షల యూనిట్లు అమ్ముడుపోయి తన విభాగంలో టాప్ ప్లేస్ సాధించింది. ఈ కారు 25.75 కి.మీ. వరకు మైలేజ్ ఇస్తుందని సంస్థ పేర్కొంది.

యూరోగ్రిప్ ట్రక్స్ ప్రత్యేక రిటైల్ స్టోర్ ప్రారంభం..

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): ప్రముఖ 2 అండ్ 3 వీలర్ టైర్ బ్రాండ్ యూరోగ్రిప్ టీవీఎస్ శ్రీచక్ర లిమిటెడ్ నుంచి హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ప్రత్యేక రిటైల్ స్టోర్‌ను ప్రారంభించింది. బీఆర్ఎస్ యూత్ లీడర్ ముఠా జైసింహ దీన్ని ప్రారంభించారు. ఈ స్టోర్ ప్రారంభంతో వాణిజ్య వాహనాలకు ఆధునిక సేవలు, నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా టీవీఎస్ టైర్స్ ట్రేడ్ మార్కెటింగ్ ప్రతినిధి వీవీఎస్ ఆనంద్ మాట్లాడుతూ "హైదరాబాద్‌లో మా ప్రత్యేక స్టోర్ ప్రారంభించడం మా కోసం గర్వకారణం. ఇది దేశంలో వేగంగా విస్తరిస్తున్న రెండు చక్రాల వాహనాల మార్కెట్‌కు ఒకటి. ఇక నుండి వినియోగదారులకు మేము డీలర్‌గార్ల సహకారంతో మరింత సమర్థవంతమైన సేవలను అందించగలము" అని తెలిపారు.

హై-లైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

సిటీబ్యూరో, మే23,(నమస్తే తెలంగాణ): దేశంలోనే అతిపెద్ద ఫ్యాషన్, లగ్జరీ, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌గా పేరుగాంచిన "హై-లైఫ్ ఎగ్జిబిషన్" వేసవి స్పెషల్ ఎడిషన్‌తో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ (నోవోటెల్), హైటెక్ సిటీలో మే 23 నుంచి నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సినీ నటులు మాల్వీ మల్హోత్రా, శ్రావంతి చోకారపు, సుభశ్రీ రాయగురు తదితరులు హాజరై ప్రారంభించగా, పలువురు మోడల్స్, ఫ్యాషన్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ వేడుకలో సమ్మర్ స్పెషల్ ఎడిషన్ కింద ప్రదర్శించిన గ్లిట్జ్-గ్లామర్, స్టైల్, లగ్జరీతో కూడిన నూతన వస్త్రరంగులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ వాసులకు వేసవి ఫ్యాషన్‌లో నూతన ధోరణులు చూపించేందుకు ఈ ఎగ్జిబిషన్ ప్రధాన వేదికగా నిలుస్తోంది.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ నగరాభివృద్ధిపై లేదు

- హైదరాబాద్ అంటే హైటెక్ సిటే కాదు.. పాతబస్తీ కూడా
- సైనికుల త్యాగాలను తక్కువ చేసి మాట్లాడటం సిగ్గుచేటు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హిమాయత్‌నగర్ భగ్గిఖానబస్తీలో పర్యటిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హిమాయత్ నగర్, మే 23: తెలంగాణ ప్రభుత్వానికి అందాల పోటీల నిర్వహణపై ఉన్న శ్రద్ధ హైదరాబాద్ అభివృద్ధి, అందాలపై లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హిమాయత్‌నగర్ డివిజన్, భగ్గిఖానబస్తీలో ఎంపీ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం బస్తీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. సైనికులను అవమానపరిచే రీతిలో కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ మాత్రమే కాదని పాతబస్తీలోని అనేక ప్రాంతాలు ఉన్నాయనే విషయాన్ని సీఎం మర్చిపోయారని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ అంటే ప్రపంచానికి తెలిసిందని, కాంగ్రెస్ నేతలకు తెలియకపోవడం బాధాకరమన్నారు. '' మమ్మల్ని విమర్శించినా భరిస్తాం.. దేశ సైనికుల త్యాగాలను తక్కువ చేసేలా మాట్లాడితే సహించం.'' అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ నేతలు పందిర్ల ప్రసాద్, నవీన్, వెంకటేశ్, మాధవి పాల్గొన్నారు.

మళ్లీ కరోనా అలజడి

(మొదటిపేజీ తరువాయి)

వ్యాధిగ్రస్తులు మాత్రం అప్రమత్తంగా ఉండాలి. కరోనా లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తలు పాటించడం మంచిది. ప్రస్తుత వైరస్‌కు వ్యాప్తి రేటు ఎక్కువగా ఉండవచ్చు, కానీ లక్షణాలు అతి స్వల్పంగా ఉంటాయి. దవాఖానలో అడ్మిట్ అయ్యే పరిస్థితులు పెద్దగా ఉండకపోవచ్చు. వ్యాపిస్తున్న వైరస్‌లు ఒమిక్రాన్‌కు సంబంధించిన సబ్‌లీనియసెస్. ఇప్పుడు ఒమిక్రాన్ వైరస్ లేదు. కానీ దాని సబ్‌వేరియంట్‌లైన ఎంసీ 1.10.1, ఎల్‌బీ 1.3.1, ఎల్ఎఫ్7 అనే సబ్ వేరియంట్లు మాత్రమే ఉన్నాయి. ఈ సబ్ వేరియంట్ల నుంచి వచ్చిన ఎల్‌పీ 8.1, ఎక్స్ఎఫ్‌పీ, ఎక్స్ఇసీ వేరియంట్లే ప్రస్తుతం వ్యాపిస్తున్నాయి. ఇప్పుడు వ్యాపిస్తున్న కరోనా వేరియంట్లలో 70 శాతం ఎల్‌పీ 8.1 వేరియంటే కనిపిస్తుంది.

జాగ్రతలు పాటించాలి

కరోనా వైరస్ అనేది డ్రాప్‌లెట్స్‌తోనే ఎక్కువగా వ్యాపిస్తుంది. ముఖ్యంగా ఇది నోరు, కళ్లు, ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఎందుకంటే నోరు, ముక్కు, కళ్లలో మ్యూకస్ మెంబరాన్స్ ఉంటాయి. ఈ మ్యూకస్ మెంబరాన్స్ ద్వారా ఏదైన బ్యాక్టీరియా గాని లేదా వైరస్ గాని సులభంగా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. అందుకని సాధ్యమైనంత వరకు చేతులతో ముఖాన్ని తాకకుండా జాగ్రత్తపడాలి. అయితే చాలా సార్లు మనకు తెలియకుండానే చేతులతో ముఖ భాగంలోని కన్ను, ముక్కు, నోరు తదితర భాగాలను తాకుతాం. ఇది సహజం కూడా. అందుకని ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలి. శానిటైజ్ చేసుకోవాలి.

వ్యాధి గ్రస్తులు జాగ్రత్తగా ఉండాలి

వ్యాధిగ్రస్తులున్న కుటుంబ సభ్యులు సైతం జాగ్రతలు పాటించాలి. ఎందుకంటే వారి వల్ల వీరికి వైరస్ సోకే ప్రమాదం ఉంటుంది. హాస్పిటల్స్‌కి వెళ్లినప్పుడు మాస్కు ధరించడం ఉత్తమం. మాస్కులు ధరించడం వల్ల కరోనానే కాకుండా ఇతర రెస్పిరేటరీ వైరస్‌ల నుంచి కూడా రక్షణ పొందవచ్చు. 60 ఏండ్ల పైబడిన పెద్దవారికి న్యూమోకోకల్ వ్యాక్సిన్ ఇప్పించడం మంచిది.

ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవాలి

జనావాసాలకు, రద్దీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించడం, చేతులను ఎప్పటికప్పుడు శానిటైజ్ చేసుకోవడం మంచిది. కరోనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే ఐసోలేషన్‌లోకి వెళ్లి, వైద్యులను సంప్రదించాలి. పాజిటివ్‌గా నిర్ధారణ జరిగితే మందులు వాడుతూ కరోనా నియమాలతో ఐసోలేషన్‌లో ఉండాలి.లక్షణాలు ఉన్నవారు జనాల మధ్య తిరగకూడదు.

సింగిల్ విండో సిస్టం అమలు చేయాలి

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం విడిపోయిన తర్వాత చాలామంది దంత వైద్యులు ఆంధ్రప్రదేశ్ డెంటల్ కౌన్సిల్‌కి చెందిన రిజిస్ట్రేషన్‌తోనే తెలంగాణలో పనిచేస్తున్నారని, వీరి బదిలీకి సమయపాలనతో కూడిన సింగిల్-విండో సిస్టం అమలు చేయాలని కోరుతూ ఏఐడీఎస్ఏ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ డెంటల్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణలోని డెంటిస్టుల నుంచి వసూలైన ఫీజులను ఆంధ్రప్రదేశ్ డెంటల్ కౌన్సిల్ తెలంగాణ కౌన్సిల్‌కు బదిలీ చేయలేదని ఏఐడీఎస్ఏ అధ్యక్షుడు డా. ఎం.డి. మంజూర్ అహ్మద్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ విషయమై అధికారికంగా చర్చించి, న్యాయమైన నిధుల పంపిణీ జరగాలన్నారు.

స్నాతకోత్సవానికి రండి..

బంజారాహిల్స్, మే 23: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌తో పాటు ఇతర అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. యూనివర్సిటీలో చేపట్టనున్న అభివృద్ధి పనులను గవర్నర్‌కు వివరించారు. యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో నిర్వహించనున్నామని, దానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.ఎల్.విజయ కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.భోజశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాయినమ్మకుంట కట్ట ఎత్తు తగ్గించాలి..

సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న యంసీపీఐ(యూ) నాయకులు, ఓంకార్‌నగర్ బస్తీ వాసులు

మియాపూర్, మే 23: ఓంకార్‌నగర్ వాసుల సమస్యలను పరిష్కరించాలని, నాయినమ్మ కుంట కట్ట ఎత్తు తగ్గించాలని డిమాండ్ చేస్తూ యంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో మియాపూర్ జోనల్ కార్యాలయం, చందానగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. మియాపూర్ డివిజన్ కార్యవర్గ సభ్యురాలు లలిత అధ్యక్షతన ఈ ఆందోళన జరగగా.. యంసీపీఐ(యు) గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్ మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ పరిధి ఓంకార్‌నగర్‌లో వెనుకబడిన వర్గాలు, నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని 25 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నారని.. ఈ కాలనీ వాసులంతా మౌలిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. అభివృద్ధి పేరుతో నాయనమ్మకుంట చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామని చెబుతూ చెరువు కట్టను ఇష్టానుసారంగా మలుపుతూ పక్కనే ఉన్న ఆక్రమణదారులకు వంత పాడుతున్నారని విమర్శించారు. కట్ట ఎత్తు పెంచడంతో వర్షం వచ్చిన ప్రతిసారి ఓంకార్ నగర్ నీట మునుగుతున్నదని.. ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. ధర్నాలో యంసీపీఐ(యూ) మియాపూర్ డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్, మియాపూర్ డివిజన్ సహాయ కార్యదర్శి పల్లె మురళి, పార్టీ గ్రేటర్ నాయకులు అంగడి పుష్ప, విమల, డివిజన్ నాయకులు శివాని, జంగయ్య, ఇషాక్, బస్తీవాసులు పాల్గొన్నారు.

నిలోఫర్ సూపరింటెండెంట్‌పై వేటు

డాక్టర్ రవికుమార్ స్థానంలో డా.విజయ్‌కుమార్ నియామకం

సిటీబ్యూరో, మే 23 (నమస్తే తెలంగాణ): నిలోఫర్ సూపరింటెండెంట్ డా.రవికుమార్‌పై ప్రభుత్వం వేటు వేసింది. ఆయనపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డా.విజయ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేసింది. ఇదిలా ఉంటే మొదటి నుంచి వివాదాస్పదుడిగా ఉన్న డా.రవికుమార్‌కు సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించడంపై అప్పట్లోనే అనేక విమర్శలు వచ్చాయి. గతంలో ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారంగా దవాఖానలో క్లినికల్ ట్రయల్స్ జరిపిన కేసుతో పాటు పలు ఇతర అంశాల్లో ఆయనపై చార్జీషీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. నిబంధనల ప్రకారం చార్జీషీట్‌లు పెండింగ్‌లో ఉన్న వైద్యాధికారులకు సూపరింటెండెంట్ వంటి పరిపాలనా బాధ్యతలు అప్పగించకూడదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా చార్జీషీట్లతో పాటు వివిధ అంశాల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న డా.రవికుమార్‌కు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించడంపై మొదటి నుంచి విమర్శలు తలెత్తుతూనే ఉన్నాయి. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన కొత్తలోనే పీజీలను వేధిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదుపై అప్పటి డీఎంఈ డా.వాణి అంతర్గత విచారణ జరిపిన విషయం తెలిసిందే. ఆ తరువాత దవాఖానలోని బ్లడ్ బ్యాంక్‌లో నుంచి బ్లడ్ ప్యాకెట్లు చోరీకి గురవడంతో పాటు తరచూ ఏదో ఒక వివాదంతో నిలోఫర్ దవాఖాన వార్తల్లో నిలుస్తూ వస్తోంది. ఇలా ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రభుత్వ పెద్దల అండదండలతో డాక్టర్ రవికుమార్ రెచ్చిపోయారు. ఇకనైనా నిరుపేదలు చికిత్స పొందే ప్రభుత్వ దవాఖానల్లో అర్హత, నిజాయితీ గల అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి రమణాచారి

హరే శ్రీనివాస పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి హరీశ్‌రావు

తెలుగు యూనివర్సిటీ: పదవులకే వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి కేవీ రమణాచారి అని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీశ్‌రావు కొనియాడారు. ఆర్డీవో స్థాయి నుంచి కలెక్టర్‌గా, టీటీడీ ఈవోగా, ప్రభుత్వ సలహాదారుడిగా పని చేసి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కేవీ రమణాచారి రచించిన 'హరే శ్రీనివాస పుస్తకాన్ని'అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామితో కలిసి సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో మాజీ మంత్రి హరీశ్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రమణాచారి తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడుగా ఉన్నప్పుడు బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వంతో ఒప్పించారన్నారు. విద్యార్థి దశలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారని కొనియాడారు. చరిత్రలో నిలిచిపోయే పనులను చేపట్టిన రమణాచారి అందరికి ఆదర్శం అ